క్లుప్తంగా

ఘనంగా చండీయాగం



పూజలు చేస్తున్న చిట్కుల్ సర్పంచ్ నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని జంగంపేట గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో శనివారం చండీయాగం, లక్షపుష్పార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చిట్కుల్ సర్పంచ్ నీలం మధు హాజరై పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాఘవరావు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామ పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను తయారు చేసి ఇవ్వాలని జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవరావు అన్నారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2023–24 ఏడాదికి అభివృద్ధి పనులను గుర్తించాలని, వాటి ఆధారంగా నిధులు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రదర్శనను తిలకిస్తున్న జీఎం మగేంద్ర వర్మన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భెల్ జీఎం మగేంద్ర వర్మన్ అన్నారు. శనివారం భెల్ కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కామర్స్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి మాట్లాడారు. ప్రపంచం సైన్స్ పైనే ఆధారపడి ఉందని, విద్యార్థులకు చిన్ననాటి నుంచి సైన్స్ పై అవగాహన కల్పించాలని అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయొచ్చని పేర్కొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి): యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని భీన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ.ముఖీమ్ అన్నారు. మనభీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్‌తో కలిసి శనివారం పట్టణంలోని ముర్షత్ దర్గ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విన్నర్ టీంకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.30వేలు బహుమతి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉస్మాన్, ఎజాస్, సత్తయ్య, వెంకటేశం రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గోవుల గుట్ట జాతర

సంగారెడ్డి టౌన్: మండలంలోని హనుమాన్ నగర్ గ్రామశివారులో లక్ష్మీనరసింహస్వామి గోవుల గుట్ట జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలు, డప్పు చప్పుళ్లతో స్వామివార్ల విగ్రహాల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం హాజరై పూజలు చేశారు. జాతరలో హనుమాన్ నగర్ ఉపసర్పంచ్ విజయలక్ష్మి, వార్డు సభ్యులు భరత్, సతీశ్, ప్రజలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని నలవల్లి గ్రామంలో ప్రారంభించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వహణకు రూ.15వేల సాయం అందించారు. క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి (పోలీస్ కానిస్టేబుల్) మొగులప్ప సూచించారు శనివారం ఝరాసంగం జెడ్పీహెచ్ఎస్, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజేందర్ రెడ్డి, హెచ్ఎంలు మాధవి, పోచయ్య, టీచర్లు రాంచందర్ భీమ్ వంశీ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వనం చెరువు నుంచి అలుగు
- రైల్వేట్రాక్ పక్కన ఏర్పడిన గుంత



కల్వర్టు కింది నుంచి పారుతున్న మురుగునీరు



రైల్వే ట్రాకుకు పక్కన చేరిన మురుగునీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ శివారులో చేరిన మురుగునీటి గుంతతో పక్కనే ఉన్న రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. రైల్వే ట్రాక్ మధ్యలో రేడియల్ రోడ్డును అభివృద్ధి పరచడంతో శేరిలింగంపల్లి శివారు ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరు వనం చెరువులోకి చేరి చెరువు అలుగు పారుతోంది. అలుగు నీటిని మళ్లించడంతో రైల్వే ట్రాక్ పక్కన ఖాళీ స్థలంలోకి చేరుతోంది. వనం చెరువు ఆనుకొని రేడియల్ రోడ్డు వేసే సమయంలో కట్టను తొలగించారని స్థానికులు ఆరోపించారు. చెరువు పక్కనే నిర్మించిన కల్వర్టు గుండా వనం చెరువు నుంచి మురుగు నీరు ట్రాక్ పక్కన గుంతలోకి చేరుతోంది. దీంతో ట్రాక్ బలహీనపడే ప్రమాదం ఉంది. ముంబై వైపు వెళ్లే రైళ్లు ఈ మార్గం గుండా వెళ్తాయని, రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో చేరిన మురుగునీటితో ట్రాక్ బలహీన పడితే ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం సంభవించకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ధాన్యం బస్తాల్లో అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న ఐకేపీ అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ముర్కుంజాల్ గ్రామంలో ఖరీఫ్‌లో పండించిన ధాన్యం, రైతులు అమ్మిన ధాన్యం బస్తాల్లో తేడాలపై శనివారం ఇందిరా క్రాంతి పథం జిల్లాస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. ధాన్యం అవకతవకలపై ముర్కుంజాల్ గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్, పీడీలకు ఫిర్యాదు చేయడంతో శనివారం అధికారులు గ్రామంలో పర్యటించారు. బుక్ కీపర్, సీసీ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, డీపీఎం కొమురయ్య, జయశ్రీ, డీఎంజీ నార నర్సప్ప, ఏపీఎం ధన్‌రాజ్‌గిరి, సీసీలు రాజు, కల్లప్ప, సంతోష్, అనుసూయతో సమావేశమై విచారణ చేశారు. 166 ధాన్యం బస్తాలు అమ్మగా 149 బస్తాలకు మాత్రమే బిల్లులు చేశారని, 17 సంచుల డబ్బులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడంతో కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని మండలంలోని తొమ్మిది కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

కనుల పండువగా రథ సప్తమి



సంగారెడ్డి టౌన్: రథయాత్రలో భక్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారు వైకుంటపురంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచారి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి రథయాత్ర పురవీధుల మీదుగా సాగింది.

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు సామూహిక సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపినవారికి హెచ్ఎం సంగమేశ్వర్ బహుమతులను అందజేశారు. ప్రతీ రోజు సూర్యనమస్కారాలు చేస్తే చురుకుదనం పెరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. కుంకుమార్చన, పుష్పార్చన, పల్లకీ సేవ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): అక్రమ బదిలీలను రద్దు చేసి, జీరో సర్వీస్‌తో బదిలీలకు అనుమతివ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కౌన్సిలింగ్ విధానాన్ని కాదని అక్రమంగా బదిలీలు చేపట్టడంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. జీఓ 317 తో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు జీరో సర్వీస్‌తో బదిలీ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాయిలు, రాంచందర్, పి.శ్రీనివాసరావు, సోమశేఖర్, బి.సాయితేజ, బి.ఎశప్ప, చందర్ రాథోడ్, జనార్ధన్, సింహాచలం, రవీందర్, జగన్మోహన్, కష్ణ, స్వప్న, సంధ్యారాణి, సిద్దేశ్వర్ అశోక్, కిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మధుసూదనాచారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. పట్టణంలో స్రవంతి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు శ్రీహరి చందన, గౌరి రుద్రాక్షలకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, కళాశాల యాజమాన్యం, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, బాబీ, సత్యం, బండిమోహన్, యూనూస్, ముర్తుజా, ఉపేందర్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ కిట్స్ అందజేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పార్కర్ హనీ ఫిన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందించారు. కంప్యూటర్, ప్రింటర్, షటిల్, క్యారం బోర్డ్, బ్యాట్, బాల్, లంచ్ ప్లేట్స్ తదితర సామగ్రిని శనివారం పాఠశాల హెచ్ఎం వేణు గోపాల్‌కు అందించారు. మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక రెడ్డి, చెల్డ్ లైన్ కోఆర్డినేటర్ మహాజీబ్, కోఆర్డినేటర్ స్వప్న, మెడ్వాన్ కోఆర్డినేటర్ హఫీజ్, నవీన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ శంభో మహా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్ రెడ్డి తెలిపారు. ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీలు ఇందిరా సతీష్, వీరేశం, బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కిషోర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ, నాయకులు పాముల శ్రీను, కొన్యాల సతీష్, నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

సంగారెడ్డి టౌన్: మండలంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ లావణ్య అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నీటి, రోడ్లు, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, జెడ్పీటీసీ సునీత మనోహర్ గౌడ్, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీటీసీలు మౌనిక, సామెల్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

హత్నూర(సంగారెడ్డి): పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే తెగుళ్లను నివారించాలని జోగిపేట ఏడీఏ అరుణ అన్నారు. మండలంలోని చింతలచెరువు, వడ్డేపల్లి గ్రామాల్లో వరి పంటలను శనివారం ఆమె పరిశీలించారు. చలి తీవ్రతతో వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి పెరుగుతుందని అన్నారు. దీని నివారణకు కార్బోఫ్యూరన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా హైడ్రోక్లోరైడ్ 4–జీ గుళికలు 8 కిలోలను ఎకరా పొలంలో చల్లుకోవాలన్నారు. తెగులు తగ్గకుంటే క్వినాలఫాస్ 2మి.లీ లేదా ప్రొఫానోఫస్ 2మి.లీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రాత్రి పూట పొలంలో నీటిని తీసివేసి, ఉదయం మళ్లీ పెట్టుకోవాలని సూచించారు. సోలార్ ట్రాప్స్‌తో కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వర ప్రతాప్, రైతులు భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రణాళికతో పనులు చేపట్టాలి



పత్రాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సంజీవరావు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని డీఎల్‌పీఓ సంజీవరావు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. శనివారం కల్హేర్ మండల పరిషత్‌లో నిర్వహించిన సమావేశంలో అభివృద్ధి, ప్రణాళిక అంశంపై అధికారులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంగ్రామ్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న కళామండలి నాయకులు

జహీరాబాద్: ప్రజలు చైతన్యవంతులు అయినప్పుడే సమాజంలో అసమానతలకు, వివిధ రకాల రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని మార్పు కళామండలి జిల్లా అధ్యక్షుడు రంచందర్ అన్నారు. శనివారం మండలంలోని అల్గోల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సామాజిక అంశాలపై పాఠశాలల్లో విద్యార్థులను, గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నర్సింహులు, రత్నం, దన్ను పాల్గొన్నారు.

పశువులకు టీకాల పంపిణీ



పశువుకు టీకాలు వేస్తున్న పశువైద్యురాలు అరుణ

జిన్నారం(పటాన్‌చెరు): పశువులు వ్యాధులకు గురికాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని గుమ్మడిదల మండల పశువైద్యాధికారి అరుణ అన్నారు. మండలంలోని మంబాపూర్‌లో శనివారం పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దశలవారిగా పశువైద్య శిబిరాలను నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సందేహాలుంటే వైద్యులను సంప్రదించాలని జీవాల పెంపకందారులకు సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ 30న జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రాధిక తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్ జిల్లా ఉపాధి కార్యాలయంలో మేళా ఉంటుందని అన్నారు. టెలి మార్కెటింగ్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్(బీపీఓ) విభాగాల్లో 150 ఖాళీలు ఉన్నాయన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉండి, ఇంటర్/ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని అన్నారు. వివరాలకు 08455 271010లో సంప్రదించాలన్నారు.

◆ నేడు జహీరాబాద్‌కు గద్దర్

జహీరాబాద్: ప్రజా గాయకుడు గద్దర్ ఆదివారం జహీరాబాద్‌కు వస్తున్నట్లు అంబేడ్కర్ పార్లమెంట్ భవన నామకరణ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఏషియన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహేశ్వర్‌రాజ్, పోకల కిరణ్ మాదిగ, గొల్లపల్లి దయానంద్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

◆ వేంకట చల క్షేత్రంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్ శివారులో వేంకట చల క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రోచ్చరణలతో స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ సింగూరులో సత్యనారాయణ వ్రతాలు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టులో వెలిసిన సుందర కల్యాణ వెంకటేశ్వర స్వామి 36వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడులక రెండో రోజు శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

◆ రోడ్లకు మరమ్మతు చేయాలి

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతు చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ పటేల్ అధికారులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తాటిపల్లి నుంచి పెద్దలోడి, మక్తక్యాసారం, గార్లపల్లి, చీలపల్లి, కల్లపల్లి బేల్లూర్, బోడపల్లి, పిల్లోడి గ్రామాల రోడ్లు కంకర తేలాయని త్వరగా మరమ్మతు చేయాలని కోరారు.

◆ ఆలయానికి విరాళం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని కంభాలపల్లి గ్రామంలో పురాతనమైన వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి శనివారం పట్టణానికి చెందిన మునిపల్లి రామకృష్ణ రూ.50వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. గురుస్వామి ఆర్ఐ సుధాకర్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు మల్లేశం, నల్ల జయరాములు గౌడ్, పూజారులు గుజ్జర్ లక్ష్మణ్, జగదీశ్వర్ స్వామి పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న కల్లేటి రాంచందర్‌కు కౌన్సిలర్ స్వప్న శనివారం ఆర్థిక సాయం అందించారు. ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్యం కోసం సాయం అందించారు.

◆ కేలండర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్: మండల కేంద్రం నిజాంపేట్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం కల్లుగీత కార్మిక సంఘం 2023 కేలండర్‌ను తహసీల్దార్ మదన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు సాయాగౌడ్, ప్రతాప్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, సాయిబాబాగౌడ్, దుర్గాగౌడ్ పాల్గొన్నారు.

◆ డ్రైనేజీ పనులు ప్రారంభం

జోగిపేట(అందోల్): అందోల్ మండలం డాకూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను సర్పంచ్ కలాలి పూజ శనివారం ప్రారంభించారు. పీర్ల మసీదు నుంచి ఇందూరి నర్సింలు ఇంటి వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజయ్, ఎంపీటీసీ ప్రమీల, కార్యదర్శి వినీత్, గ్రామస్తులు మధుసూదన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, భూమయ్య, సంజీవయ్య, ప్రవీణ్, దుర్గేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ నియామకం

జోగిపేట(అందోల్): జోగిపేట బీరప్ప స్వామి గొర్రె కాపరుల సహకార సంఘం కార్యాలయంలో శనివారం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి విజయలక్ష్మి, ఆడిటర్ నరేష్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా గూడెం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కడాల రాములు, ఉపాధ్యక్షుడిగా గొర్లకాడి వెంకటేశం, డైరెక్టర్లుగా మాసగోని లక్ష్మణ్, కడాల మల్లేశం, ఊస నాగరాజు, బీర్లఅనిల్, గూడెం భాగ్య, బక్కమొల్ల శివకళను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకదారుల సంఘం డైరెక్టర్ నవాబ్ గారి భూమయ్యలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కురుమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కార్యదర్శిగా చిందం కుమార్, ఉపాధ్యక్షుడిగా గొర్లకాడి మల్లేశం, డైరెక్టర్లుగా బురగొని హరీష్, చిందం మల్లేశం, గొల్ల వెంకటేశం, శ్రీనివాస్, మామిడిపల్లి శ్రీనివాస్, కడాల మల్లయ్య, కోశాధికారిగా ఊస జోగినాథ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కురుమ సంఘం యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కురుమ యూత్ అధ్యక్షుడుగా ఊస శివశంకర్, ఉపాధ్యక్షుడిగా దండు మల్లేశం, కార్యదర్శిగా బి.మల్లేశం, డైరెక్టర్లుగా శంకర్, శివకృష్ణ, శ్రీకాంత్, పవన్ కుమార్, మహేందర్, జోగినాథ్‌ను ఎన్నుకున్నారు.

◆ క్షయ నిర్ధారణ శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్య సమస్యలు ఉన్నవారు క్షయ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన టీబీ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవనీత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ రోడ్డు నిబంధనలు పాటించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): వాహనదారులు రోడ్డు నియమాలను పాటించాలని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం అన్నారు. శనివారం మండలంలోని గంగ్వార్, ముంగి ప్రధాన చౌరస్తాల వద్ద హద్నూర్, రాయికోడ్, ఝరాసంగం ఎస్ఐ వినయ్‌కుమార్, ఏడుకొండలు, రాజేందర్‌రెడ్డితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. అనంతరం వాహన చోదకులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చర్యలు తప్పవని అన్నారు.

◆ పీఏసీఎస్ డైరెక్టర్ మృతికి సంతాపం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనారోగ్యంతో శనివారం మృతి చెందిన తెల్లాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ అంతమ్మ కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు భరత్ కుమార్, నాగరాజు, మాజీ సర్పంచులు మల్లేపల్లి సోమిరెడ్డి, కుమార్ గౌడ్ , క్రిస్టోఫర్ తదితరులు మృతికి సంతాపం తెలిపారు.